క్లుప్తంగా

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అనుమతితో ఎంపీ అర్వింద్ సూచనల మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి గురువారం ప్రకటించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో చురుకైన నాయకులతో కూర్పు చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నక్క రాజేశ్వర్, రాంచందర్, బట్టు రాము, పి.సురేందర్, ప్రమోద్‌కుమార్, పాలేపు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా పోతంకర్ లక్ష్మీనారాయణ, నిమ్మల శ్రీనివాస్ రెడ్డి, నాగోల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులుగా అనిల్, నర్సారెడ్డి, పి.వేణు, దాంపల్లి జ్యోతి, రాధ, సవిత, జిల్లా కోశాధికారిగా చింతకింది శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా బద్దం కిషన్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీధర్, మీడియా కన్వీనర్‌గా పుట్ట వీరేందర్, ఐటీ ఇన్‌చార్జిగా పిల్లి శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

మానసిక దివ్యాంగులను ప్రోత్సహించాలి

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో మంచి ప్రగతి సాధిస్తున్నారని వారిని మరింత ప్రోత్సహించాలని జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ అన్నారు. గురువారం మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రశంసలు పొందారన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల్లో కూడా ఎంతో ప్రతిభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్. సిద్ధయ్య, ఎస్. జ్యోతి, రాజేశ్వరి, డాక్టర్ రవితేజ, పిల్లల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కమిషనర్


రవీంద్రసాగర్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌గా పి.రవీంద్రసాగర్ గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అన్ని విభాగాల హెడ్‌లతో మాట్లాడారు. ఉద్యోగులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నరు. నగరంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కార్మికులను నియమించాలి

ఇందల్వాయి: పల్లెల్లో పారిశుద్ధ్యం మరుగున పడి విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జనాభాకు సరిపడ పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో అనంత్‌రావుకు వినతి పత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి వెంకన్న నాయకులు గంగాధర్ గౌడ్, కిషన్, మోహన్, లాలయ్య, పోశెట్టి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఏఎంసీ నజీర్ పరిశీలించారు. గురువారం 4ఎ సర్కిల్‌లోని కంఠేశ్వర్, కంఠేశ్వర్ బైపాస్, గూపన్‌పల్లిల్లో పనులను పరిశీలించి కార్మికుల హాజరును తనిఖీ చేశారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు.

నిబంధనలు పాటించాలి

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో ఎస్సై సందీప్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 150 వరకు గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు. విగ్రహాలు, నిర్వాహకుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో అనంత్‌రావు, విద్యుత్ శాఖ ఏఈలు జ్ఞానేశ్వర్, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాట రచన మెళకువలపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని జీజీ కాలేజ్‌లో కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'పాట రచన మెళకువలు' అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సినీ, టీవీ రంగంలోనే కాక సోషల్ మీడియాలో కూడా ఎందరో గాయకులు ప్రతిభ చాటి సెలబ్రిటీస్ అవుతున్నారని అన్నారు. ముఖ్య వక్త సిర్ప లింగం పాట రచన మెళకువలపై అవగాహన కల్పించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి గేయం, గీతం పాట, బేధాలు, లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, కార్యక్రమ నిర్వాహకుడు కె.గంగాధర్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ శమంత, డాక్టర్ శ్రీనివాస్, రాజేశ్వర్, రాధిక, అర్చన, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాజేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ నహీద బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం
- టీబీ వ్యాధిపై ఖైదీలకు అవగాహన


శిబిరంలో మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ దశరథం

నిజామాబాద్ లీగల్: అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం అన్నారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా గురువారం సారంగపూర్‌లోని సెంట్రల్ జైల్‌లో టీబీ వ్యాధిపై అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి జైలు సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. ఖైదీల్లో టీబీ వ్యాధిపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఖైదీలకు వివరించారు. క్యాంపులో భాగంగా వ్యాధి నిర్ధారణకు ఖైదీలకు ఎక్స్‌రేలు తీయించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారిణి అవంతి, జైల్ మెడికల్ ఆఫీసర్ దినేశ్, జిల్లా టీబీ, హెచ్ఐవీ కో–ఆర్డినేటర్ రవిగౌడ్, డీపీసీ లక్ష్మణ్, జైలు సూపర్‌వైజర్ స్రవంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

- చెక్ డ్యాం పైనుంచి రాకపోకలు
- నిధులు లేక నిలిచిన కప్పలవాగు నిర్మాణ పనులు


ప్రవాహానికి కొట్టుకుపోయిన గడ్కోల్ తాత్కాలిక రోడ్డు

సిరికొండ: హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగలడంతో గడ్కోల్ గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈ గ్రామం పక్కనే కప్పల వాగు ఉంది. ఆ వాగుపై నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన హైలెవల్ వంతెన నిర్మాణానికి గతేడాది ఆర్అండ్‌బీ శాఖ ద్వారా నిధులు రూ. 12 కోట్లు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణ పనులకు 2024 జనవరి 19న ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. పాత వంతెనను తొలగించి దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పిల్లర్ల దశలో పనులను నిలిపివేశారు. వంతెన పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం వైపు వెళ్లడానికి ఈ వాగు దాటే వెళ్లాలి. గ్రామానికి చెందిన వందలాది మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు వాగు అవతలనే ఉన్నాయి. పంట భూముల వద్దకు నిత్యం వదుల సంఖ్యలో వెళ్తుంటారు. వంతెన నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల గ్రామస్తులు అవస్థలు పడాల్సి వస్తోంది.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

వంతెన నిర్మాణం చేపడుతుండటంతో రాకపోకల కోసం వాగులో పక్క నుంచి తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. వర్షాలకు వాగు ప్రవహించడంతో తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు వాగు అవతల వరకు వచ్చి అటే వెళుతున్నాయి. గ్రామస్తులు, రైతులు చెక్‌డ్యాం గోడ మీదుగా ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు.

రోడ్డు వేయించిన రైతులు

తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు స్వంతంగా రోడ్డును నిర్మించుకున్నారు. పొలాల వద్దకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఎకరానికి రూ. 200 చొప్పున డబ్బులు జమ చేసి చెక్‌డ్యాంకు ఆనుకొని తాత్కాలికంగా రోడ్డును వేసుకున్నారు. గత ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాత్కాలికంగా రైతులు వేసుకున్న రోడ్డు, చెక్ డ్యాం పైనుంచి వాగు పారుతోంది. పొలాల వద్దకు వెళ్లే రైతులు, జిల్లా కేంద్రం వైపు గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ద్విచక్ర వాహనాలతో చెక్ డ్యాం పైనుంచి వరద నీటిలోనే ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. రోజుకు ఒకరిద్దరు అదుపుతప్పి ద్విచక్ర వాహనం పైనుంచి గాయాల పాలవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గత ఏడాది వానకాలంలో పలువురు పడిపోగా ఒకరిద్దరికి కాలు, చేతులు విరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం చెక్‌డ్యాం పైనుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గ్రామస్తులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పిల్లర్ల వరకే పూర్తయిన కప్పల వాగు వంతెన


చెక్‌డ్యాం పైనుంచి వెళ్తున్న గ్రామస్తులు

ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యేకు ఫిర్యాదు అందజేస్తున్న సభ్యులు

డిచ్‌పల్లి: మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన రుణాలను రెండు నెలలుగా నిబంధనల పేరుతో ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్న ఎన్‌డీసీసీ బ్యాంక్ డిచ్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మహిళా సంఘాల సభ్యులు కలిసి ఫిర్యాదు చేశారు. ఏదైనా సంఘం రుణం చెల్లించకపోతే వీవోఏ ల వ్యక్తిగత ఖాతా నుంచి బెదిరించి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తారని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎన్‌డీసీసీ బ్యాంక్ చైర్మన్ రమేశ్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మేనేజర్‌పై చర్యలు తీసుకుని మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి



నిజామాబాద్ రూరల్: గణేశ్ నిమజ్జనంలో వినాయక్‌నగర్‌లో ఉన్న గణేశ్ బావి ప్రాంతంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రత్నాకర్, ఖుద్దూస్ తదితరులున్నారు.

సంక్షిప్తం

టీఎల్ఎం మేళాలు స్ఫూర్తినిస్తాయి

నిజామాబాద్‌అర్బన్: పాఠశాలల్లో విద్యార్థులకు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మేళా) మేళాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని డీఈవో అశోక్ అన్నారు. గురువారం దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారిగా వివిధ సృజనాత్మక పద్ధతులు పాటించడం బాగుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్ మీఎన్ గౌడ్, హెచ్ఎం శ్రీనివాస్, ఎమ్మార్పీలు, టీచర్లు సుజాత, లావణ్య, సంతోషిని తదితరులు పాల్గొన్నారు.

శంకర్ భవన్ పాఠశాలలో

నగరంలోని కోటగల్లి శంకర్‌భవన్ పాఠశాలలో దక్షిణ మండల స్థాయి టీఎల్ఎం మేళాను ఎంఈవో సాయి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేళాలో 22 ప్రాథమిక పాఠశాలలు పాల్గొనగా ప్రతి పాఠశాల నుంచి మూడు చొప్పున బోధనోపకరణాలను ఉపాధ్యాయులు ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు బెస్ట్ టీఎల్ఎం ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ దక్షిణ మండల అధ్యక్షుడు గంగా కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ నూతన కార్యవర్గం

నిజామాబాద్ రూరల్: నగరంలోని గోల్ హనుమాన్ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బండారి నరేందర్, ధర్మకర్తలుగా టి.రామ్మోహన్ జి.సుధీర్, కె.లింగం కె.విజయ్ కుమార్, స్వప్న, గంట జ్యోతి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గంతో దేవాదాయ శాఖ పరిశీలకులు బి కమల ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, వ్యవసాయ శాఖ సభ్యుడు గడుగు గంగాధర్, ఆలయ కార్యనిర్వహణాధికారి గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ శివరాత్రి ఆంజనేయులు, ఆజాద్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో..

నిజామాబాద్ నాగారం: నగరంలోని ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఆరెకటిక సంఘం లో జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు న్యామతాబాద్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మిరియాల్ కార్ మోహన్, కోశాధికారి శ్రీనివాస్ ను ఆయన అభినందించారు.

సమాజానికి బాధ్యతను గుర్తు చేయడమే..

నిజామాబాద్ రూరల్: హిందు సమాజానికి బాధ్యతను గుర్తు చేయడమే శతాబ్ది ఉత్సవాల లక్ష్యమని ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభు కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హల్ లో ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం, నగర కార్యవాహ అరుగుల సత్యం, సహకార్యవాహ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అభినందనలు

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాంచందర్ పీహెచ్‌డీ పట్టా పొందడంతో కళాశాల అధ్యాపకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాంచందర్ గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు శ్రీరామ్, ప్రభాకర్, రవి రాజ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటవ టౌన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న అనిల్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు 2013 కానిస్టేబుల్ బ్యాచ్ మెట్స్ అందరూ కలిసి బాధిత కుటుంబానికి రూ.51వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బాధిత కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో వివిధ పోటీ పరీక్షల కోసం సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు గోల్కొండ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ బెల్లంకొండ సైదులు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు శ్రీనురాథోడ్, విద్యార్థులు సునీల్, రాజు పటేల్, సందీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కాసర్లకు సన్మానం




మోపాల్: మండలంలోని సిర్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావును తెలంగాణ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన విద్యార్థుల విజయగాథ ట్రయల్–బ్లేజర్స్‌లో పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలను ప్రచురితం కావడంలో ఆయన తీవ్రంగా కృషి చేశారని జిల్లా అధ్యక్షుడు లాటికర్ రాము అభినందించారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయుడు గంగాప్రసాద్, వసంత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత కార్తీక్ నాయక్‌కు..



సుభాష్‌నగర్: జిల్లాలోని జక్రాన్‌పల్లి తండాకు చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార అవార్డు గ్రహీత కార్తీక్ నాయక్‌ను ప్రకాశ్ హ్యుందాయ్, జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ హ్యుందాయ్ అధినేత నల్ల దినేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన యువకుడు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార అవార్డు పొందడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్ హ్యుందాయ్ షోరూమ్ ప్రతినిధి నల్ల ప్రతిహాస్‌రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి, పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కోశాధికారి విజయ్ కుమార్ స్వామి, జాయింట్ సెక్రెటరి కర్క శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్



సిరికొండ: మండలంలోని వర్జన్ తండాలో తీజ్ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల క్రితం నాన బెట్టిన గోధుమ మొలకలకు బంజారా యువతులు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయరీతిలో పాటలు పాడుతు నృత్యాలు చేశారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గోధుమ మొలకలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పేదల గుడిసెలు తొలగిస్తే సహించం


బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని దొడ్డి కొమురయ్య కాలనీలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని సీపీఎం నాయకులు హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి బెజుగం సుజాత మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య నగర్‌లో ఇరవై ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. పేదల గూడు కోసం సీపీఎం ఎంతో పోరాటం చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన పేదలు ఇళ్లు కట్టుకుంటుంటే ఫారెస్టు అధికారులు వచ్చి అభ్యంతరం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను ఇబ్బందులకు గురి చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బల్దియా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రాములు, ఎస్.నరసయ్య, అనసూయ, అనిత, యశోద, లక్ష్మీబాయి, మంగళ్ బాయి, రమాబాయి, సంగీత, పంచపూల, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు


దుబ్బాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


మనోహరాబాద్‌లో..

ధర్పల్లి: రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పామ్ ఎంతగానో దోహదపడుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ అన్నారు. మండలంలోని దుబ్బాకలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఎకరం వరి పంటకు అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పంట నాటిన నాలుగేళ్ల నుంచి ఒక ఎకరాకి పది టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు మధుసూదన్, స్నేహలత, ఆయిల్ పామ్ కంపెనీ క్లస్టర్ ఆఫీసర్ భూమేశ్, రైతులు పాల్గొన్నారు.

మనోహరాబాద్, పడకల్ గ్రామాల్లో

జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ , పడకల్ గ్రామాల్లో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మనోహరాబాద్‌లో మండల వ్యవసాయ అధికారిణి దేవిక మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పలు రకాల సబ్సిడీలతో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ పంటను ఒకసారి నాటితే నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ మధ్యలో అంతర పంటల సాగు మొక్కజొన్న, జొన్న, పసుపు, కూరగాయలు, సోయా సాగు చేసినందుకు గాను ఎకరానికి రూ. 4200 చొప్పున రైతు ఖాతాలో సంవత్సరానికి ఒకసారి జమ చేస్తున్నామని తెలిపారు. పడకల్‌లో మండల ఏఈవో సుభాష్యా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో హార్టికల్చర్ అధికారి రాజు, మండల ఏఈవో శివ ప్రసాద్, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి రాకేశ్, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్‌లో ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో కేఆర్ మనోహర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నాయకులు గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, మాజీ సర్పంచ్ బడాల మహిపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రొండ్ల సాయారెడ్డి, డీలర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



సిరికొండ: మండలంలోని తూంపల్లి, పాకాల గ్రామాల్లో కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. తూంపల్లిలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు తెడ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, తోయెటి వినోద్, మాజీ సర్పంచ్ బూస దేవరాజు, రాజ్‌కుమార్, పాకాలలో బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు రూప్‌సింగ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి


బల్దియా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నగర కార్యదర్శి ముస్కె సుధాకర్ మాట్లాడుతూ.. నగరంలోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ సరిగా చేయడం లేదని విమర్శించారు. దీంతో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నగరంలో కుక్కలు, కోతుల సమస్య తీవ్రంగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని 60 డివిజన్లలో దోమల మందు ఫాగింగ్, పిచికారి రెగ్యులర్‌గా చేయించాలన్నారు. నాయకులు సంధ్యారాణి, గణేశ్, సాయిబాబా, విఠల్, గంగాధర్, కిరణ్, అమూల్య, సాయిలు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.